రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- బొడ్డుపల్లి కృష్ణ

హిమాయత్‌నగర్, నవంబర్ 30: రాష్ట్రంలో అత్యంత వెనకబడి ఉన్న రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని తెలంగాణ రజక వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ ఫలాలను రజకులు పొందలేక సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ పరంగా వెనకకు నెట్టివేయబడ్డారని తెలిపారు. దేశంలోని 18 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాల్లో ఉండటంతో వారు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రయోజనాలు పొందుతూ మెరుగైన జీవనం సాగిస్తున్నారని అన్నారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఈ సామాజికవర్గం అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే చర్యలు

- వ్యర్థాల తరలింపునకు స్పెషల్ డ్రైవ్
- భవన యజమానులకు రాంకీతో అనుసంధానం..
- నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలు వేసిన వారికి జరిమానాలు..

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలను పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి

జూబ్లీహిల్స్, నవంబర్ 30 : రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేసి ప్రజలకు అసౌకర్యం కలిగించేవారిపై జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఎక్కడపడితే అక్కడ డెబ్రిస్ వేస్తూ ట్రాఫిక్ కష్టాలను పెంచుతున్న భవన యజమానులపై కొరడా ఝుళిపించనున్నారు. అయితే వారికి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ వ్యర్థాలు పారవేస్తున్న వారికి జరిమానాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశాల మేరకు యూసుఫ్‌గూడ సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. నగరంలో పాత భవనాలను తొలగించి కొత్త భవనాలను కడుతున్నప్పుడు ఆయా భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ వేయాలో తెలియక రోడ్లపై పారవేస్తూ చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిపోయింది. ఈ విషయమై భవన యజమానులకు అవగాహన కల్పించడంతో పాటు రాంకీ సంస్థను వారికి అనుసంధానించనున్నారు. దీంతో సదరు భవన వ్యర్థాలను సంబంధిత సైట్‌లోకి రాంకీ వాహనాలు వచ్చి సేఫ్‌గా తరలించనున్నాయి. గృహ నిర్మాణాలకు సంబంధించిన డెబ్రిస్ రోడ్లపై వేస్తే జరిమానా తప్పదని యూసుఫ్‌గూడ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి హెచ్చరించారు. శనివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేసేవారిని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ వ్యర్థాలను రాంకీ ఏజెన్సీ తరలిస్తుందని.. వెంటనే వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్లపై గృహ నిర్మాణ వ్యర్థాలు వేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. భవన నిర్మాణ యజమానులు యూసుఫ్‌గూడ సర్కిల్‌లో గృహ నిర్మాణ వ్యర్థాలను తరలించేందుకు రాంకీ ప్రతినిధి బాలసాయి, 93819 62558 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రిస్మస్ వేడుకలకు సహకారం : ఎమ్మెల్యే మాగంటి

డిసెంబర్ 14న ఎస్‌పీఆర్ హిల్స్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆవిష్కరించారు. శనివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరమ్ నేతలతో సమావేశమయిన ఎమ్మెల్యే.. వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకలను భారీ ఎత్తున నిర్వహించేందుకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఫోరమ్ అధ్యక్షుడు బిషప్ డా.కే.విద్యాసాగర్, బిషప్ జోసఫ్ నాగేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, రాకేశ్, జీవన్, పీటర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్, నవంబర్ 30

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశ్ మృతి తీరని లోటు

హిమాయత్‌నగర్, నవంబర్ 30: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేశ్ గుండెపోటుతో శనివారం మృతి చెందడం పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాల మల్లేశ్ అకాల మరణం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ.నరసింహ, వి.ఎస్.బోస్, నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేంపావని అన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి అనేక సమస్యలకు పరిష్కారం చూపారని, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌లలో పనిచేసిన బాల మల్లేశ్ సీపీఐలో రాష్ట్ర సహాయ కార్యదర్శిస్థాయి వరకు ఎదిగారని తెలిపారు. పేదలకు అండగా నిలిచి వారికి ఇండ్ల స్థలాలు, పట్టాలు ఇప్పించేందుకు ఎంతో కృషి చేశారని అన్నారు. బాల మల్లేశ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని వారు కోరారు.

నేడు ఫ్రీ మెగా మెడికల్ క్యాంప్

జూబ్లీహిల్స్, నవంబర్ 30 : యూసుఫ్‌గూడలో ఆదివారం ఫ్రీ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నవ నిర్మాణ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.నవీన్ యాదవ్ ఒక ప్రకటన లో తెలిపారు. మెడిస్టార్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరంలో గైనకాలజిస్ట్, పిడియాట్రిక్, ఫిజియోథెరపిస్ట్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, వ్యాస్క్యులర్ సర్జన్‌ల వైద్యులు సేవలందించనున్నట్లు తెలిపారు. ఆ యా విభాగాల్లో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో ని వల్లాల గ్రౌండ్స్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

● ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

శ్రీనగర్ కాలనీలోని క్వీన్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ విశేషంగా ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్లు ఆలోచింపజేశాయి. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకే ప్రతీ సంవత్సరం సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామలింగం తెలిపారు. - జూబ్లీహిల్స్, నవంబర్ 30

శాస్త్రీయ కళా రూపాలను ప్రోత్సహించాలి

రవీంద్రభారతి, నవంబర్ 30 : శాస్త్రీయ కళారూపాయలను ప్రోత్సహించడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత రంగస్థలం అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల సైద్ధాంతిక కూచిపూడి నాట్య శిక్షణ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివిధ అంశాలపై చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నది.

7న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కాచిగూడ, నవంబర్ 30 : 2024 సంవత్సరంలో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో 80 శాతం మార్కులు సాధించిన తెలంగాణ వ్యాప్తంగా అనాథ మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కరాలు, ఆర్థికసాయాన్ని అందజే యనున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్రావు శనివారం తెలిపారు. తల్లిదండ్రులు, సంరక్షకుల్ని కోల్పోయిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం 11గంటలకు కాచిగూడలోని మున్నూరుకాపు సంఘంలో అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. పూర్తి వివరాలకు 040-24658160, 9491627404లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ట్రస్టీలు పి. విష్టు వర్ధన్, పిల్లి శ్రీనివాస్‌రావు, ఆకుల నగేశ్, దేవేందర్, చంద్రశేఖర్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

జూబ్లీహిల్స్ డివిజన్, ఫిలింనగర్‌లోని బీఎన్‌ఆర్ బ్రిలియంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ఆకట్టుకుంది. ప్రదర్శనలో భాగంగా వాయు కాలుష్యం, వ్యవసాయం, మానవశరీర నిర్మాణం, పర్యావరణం, టెర్రస్ గార్డెనింగ్, తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ వీరా రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవి, తదితరులు పాల్గొన్నారు. *– బంజారాహిల్స్,నవంబర్ 30*

11న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

గ్రాండ్ క్రిస్మస్ గోడ పత్రికను జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్, నవంబర్ 30: రహ్మత్‌నగర్ డివిజన్, ఎస్‌పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో డిసెంబర్ 11న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రాండ్ క్రిస్మస్ గోడ పత్రికను జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కార్యాలయం లో మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రిక ను అందజేశారు. ఈ వేడుకలకు బెల్లంపల్లి కల్వరి మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, పాస్టర్ ప్రవీణ్, షారోన్ దంపతులు హాజరుకానున్నట్లు.. జూబ్లీహిల్స్‌లోని క్రైస్తవులందరూ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

7న సరూర్‌నగర్‌లో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, తదితరులు

హిమాయత్‌నగర్, నవంబర్ 30: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబర్ 7న సరూర్‌నగర్‌లోని వీఎంహోం రెసిడెన్షియల్ స్కూల్‌లో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు జరుగుతాయని పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ హరినాథ్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.సురేందర్ తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ చేతుల మీదుగా ఆయన నివాసంలో ఆవిష్కరించారు.

భగవద్గీత పఠనం నేటి తరానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు లకావత్ సిల్మా, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

'సమ్మాన్యుడు' పుస్తకావిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 30. సిరివెన్నెల సీతారామశాస్త్రి విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించిన కర్మయోగి అని వక్తలు శ్లాఘించారు. అక్షజ్ఞ పబ్లికేషన్ ఆధ్వర్యంలో సిరివెన్నెల సుమధుర జ్ఞాపకాలతో కూడిన కార్యక్రమం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ఆద్యంతం సిరివెన్నెల సీతారామశాస్త్రి జీవిత విశేషాలతో సాగింది. రచయిత చేబోలు శ్రీరామశాస్త్రి సంకలనం చేసిన సిరివెన్నెల తొలిగురువు 'సమ్మాన్యుడు' పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, రచయితలు, పాత్రికేయులు ఎంవీఆర్ శాస్త్రి, గుండు వల్లీశ్వర్, వైద్యులు డాక్టర్ పన్నాల కృష్ణ సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు. సిరివెన్నెల రచనలోని పలు గీతాలను పలువురు గాయనీగాయకులు ఆలపించి సంగీతప్రియులను అలరించారు.

సుజాతకు పురస్కారం

తెలుగు యూనివర్సిటీ : ప్రాజ్ఞిక ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో శనివారం జానకమ్మ స్వరవైభవం శీర్షికన నిర్వహించిన సంగీత విభావరి ఆద్యంతం సంగీత ప్రియులను ఓలలాడించింది. సినీ నేపథ్యగాయని సుజాత ప్రముఖ గాయని జానకమ్మ ఆలపించిన 35 మధురగీతాలను ఆలపించి రసజ్ఞులైన సంగీత ప్రియుల కరతాళధ్వనులందుకున్నారు. అనంతరం జరిగిన సభలో సుజాతకు ప్రాజ్ఞిక-సీల్‌వెల్ సభ్యులు బహుముఖ మధుర గాయని అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.

నేటితో ముగియనున్న సమగ్ర కుటుంబ సర్వే

- యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 89 శాతం పూర్తి : డీసీ జాకియా సుల్తానా
- డేటా ఎంట్రీపై అధికారుల దృష్టి

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సర్వే చేపడుతున్న ఎన్యుమరేటర్ లక్ష్మి, సూపర్‌వైజర్, సీఓ ప్రశాంత్

జూబ్లీహిల్స్, నవంబర్ 30 : జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే 89 శాతం పూర్తయినట్లు డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. గత 20 రోజులుగా చేపడుతున్న సర్వే నేటితో ముగియనుందని తెలిపారు. అయితే సమగ్ర కుటుంబ సర్వే 100 శాతం పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇంటింటి సర్వే తుది దశకు చేరుకున్నట్లు.. స్టిక్కర్‌లు వేసిన అన్ని గృహాల్లో సమగ్ర కుటుంబ సర్వే సంపూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో సమగ్ర సర్వే ప్రొఫార్మాల డేటా ఎంట్రీ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించనున్నారు. జీహెచ్‌ఎంసీ 19వ సర్కిల్ పరిధిలోని యూసుఫ్‌గూడ, వెంగళరావు నగర్, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్‌లలో 84 వేల ఆవాసాల్లో జీహెచ్‌ఎంసీ బృందాలు సర్వే నిర్వహించాయి. ఆయా వార్డుల పరిధిలోని 690 ఎన్యుమరేషన్ బ్లాక్‌ల్లో ఒక ఎన్యుమరేటర్ 150 ఇళ్లలో సర్వే నిర్వహించారు. కాగా.. నేటితో ముగియనున్న సమగ్ర కుటుంబ సర్వే వంద శాతం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు.

మణికొండ క్వార్టర్స్‌లో అయ్యప్ప మహాపడి పూజ

మణికొండ క్వార్టర్స్ దివ్య జ్యోతి అయ్యప్ప స్వామి ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజల్లో మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి , కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, శైలజ, వందన, తదితరులు పాల్గొన్నారు. *– మణికొండ, నవంబర్ 30*

ట్రేడ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

రవీంద్రభారతి, నవంబర్ 30: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెహమాన్ బాబా సంస్థ నిర్వహిస్తున్న ట్రేడ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ వాల్‌పోస్టర్‌ను శనివారం రవీంద్రభారతిలోని ప్రాంగణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు వారాల పాటు జరిగే ఈ వర్క్‌షాప్ ఔత్సాహిక, బిగినర్స్ అమెచ్యూర్, మరియు మిడ్ ప్రొఫెషనల్‌కు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సింగపంగ ప్రభాకర్, ఒగ్గు రవి, యూనస్ ఫర్హాన్ పాల్గొన్నారు. ఆసక్తి గలవారు 9949303111లో సంప్రదించాలన్నారు.

మారుతున్న పరిస్థితుల్లో న్యాయవిద్యకు మంచి డిమాండ్

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి

న్యాయవిద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి

బంజారాహిల్స్, నవంబర్ 30: గతంలో న్యాయవిద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులకు పరిమిత ఉపాధి అవకాశాలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం దేశవిదేశాల్లో నైపుణ్యం కలిగిన న్యాయవాదులకు మంచి డిమాండ్ ఉందని ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొ.బాలకిష్టారెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ లా కాలేజీలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. న్యాయవిద్యను పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో న్యాయవిద్యపట్ల కొంత నిర్లక్ష్యం జరిగిందని, అందుకే విదేశాల్లో కేవలం ఇంజినీరింగ్, మెడిసిన్ చేసినవారే ఎక్కువగా కనిపిస్తుంటారన్నారు. అయితే మారిన కార్పొరేటీకరణ, ఇతర అంశాల కారణంగా న్యాయవాదవృత్తికి కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కార్పొరేట్ లాతో పాటు అనేక కోర్సుల్లో నైపుణ్యతను సాధిస్తే విదేశాల్లో సైతం మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. డిజిటలైజేషన్ యుగంలో ఎప్పటికప్పుడు న్యాయవిద్యార్థులు అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న పదేళ్లలో మరిన్ని అవకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ వలీవుల్లా, కార్యదర్శి జాఫర్ జావేద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొ.గీతారావు, తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మరల్చి సెల్ ఫోన్ చోరీ

వెంగళరావునగర్, నవంబర్ 30 : ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ ఆగంతకుడు దృష్టి మరల్చి సెల్ ఫోన్‌తో ఉడాయించిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన రిహాన్ మోండల్ రాజ్‌భవన్ ఎదురుగా ఉన్న ఎంఎస్ మక్తాలో ఉంటూ కూకట్‌పల్లిలో ఎక్స్‌రే టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగించుకుని మెట్రోరైల్‌లో వచ్చి అమీర్‌పేటలో దిగాడు. పార్కింగ్‌లో పెట్టిన సైకిల్ తీసుకుని ఇంటికి బయలు దేరాడు. ఈ క్రమంలో ఫోన్ తీసి స్నేహితుడితో మాట్లాడి ఫోన్ జేబులో పెట్టుకున్నాడు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఆగంతకుడు ఫోన్ చేసుకుని ఇస్తానని చెప్పడంతో రిహాన్ ఇచ్చాడు. ఫోన్ మాట్లాడుతున్నట్లు నటించి అక్కడి నుండి పంజాగుట్ట వైపు పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

CAUTION NOTICE

GENERAL PUBLIC is hereby kept informed that my client Sri Kaku Sukumar Reddy, S/o. Late Sri K.V.Ramana Reddy, R/o. Flat No. 501, (H.No. 7-1-29), Pent House, Shiva Leela Apartments, Leelanagar Colony, Ameerpet, Hyderabad-500 016, T.S., (Cell Nos. 9396622223 / 9440800900) is an absolute owner and possessor of Open Land / Plot No. 14, admeasuring in all 500.0 Sq.Yards or equivalent to 418.4 Sq.Mts. in Sy.No. 238, 239, 241, bounded on North by: Plot No. 13, South by: Plot No. 15, East by: 40'-0" Ft. wide Road & West by: Plot No. 19, situated at Pedda Shapur Village/Colony, Shamshabad Mandal, Ranga Reddy District-501 218, T.S. by virtue of a Regd. Sale Deed bearing Doc.No. 1422 of 2003, Dated 25-06-2003, Registered before SRO Shamshabad, Ranga Reddy District and my client is in physical possession and in occupation of said property i.e., Open Land / Plot bearing No. 14 (as stated supra) since date of his purchase without any hindrance or interference from any third parties. My client through reliable sources came to know that some un-known person is claiming the above said property through forged & fabricated documents. My client has not executed any document transferring his rights or interest in favour of any third party at any point of time.

General Public are hereby informed & cautioned through this notice that my client alone is the only owner and in physical possession of Open Land / Plot No. 14 (as stated supra) even today and is the only person has having alienating rights and general public are hereby cautioned that they should not deal or transact in respect of above roperty/Plot except my client and inspite of this notice if any person deals or transact in respect of above property/plot No.14, it will be illegal and nonest in eye of law and not binding on my client.

Sd/- G. BABU RAO, Advocate
6-1-225, Padma Rao Nagar,
Secunderabad-500 020, T.S.,
Cell No. 9666819072.
Dated 30-11-2024, Place: Hyderabad.